గొర్లివానిపాలెం పంచాయతీకి లారస్ ల్యాబ్స్ వితరణ

విశాలాంధ్ర-పరవాడ : లారస్ ల్యాబ్స్ యాజమాన్యం మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. పరవాడ మండలం గొర్లివానిపాలెం పంచాయితీకి ట్రాక్టర్ ను వితరణ చేశారు. పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ కోసం ట్రాక్టర్ గాని, వ్యాన్ కానీ ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ గొర్లి అమ్మలు ఇటీవల లారస్ ల్యాబ్స్ యాజమాన్యాన్ని కోరారు. వెంటనే స్పందించిన సంస్థ యాజమాన్యం ట్రాక్టర్ (ఇంజన్ తో పాటు ట్రక్)ను ఏర్పాటు చేసారు. మంగళ వారం ఈ వాహనాన్ని గొర్లివానిపాలెంలోని లారస్ కార్పొరేట్ ఆఫీస్ వద్ద సంస్థ సీఈవో చావా సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ చావా నర్సింగరావు చేతుల మీదుగా పంచాయతీ పాలకవర్గానికి అందజేశారు. అడిగిన వెంటనే ట్రాక్టర్ ను ఏర్పాటు చేసిన లారస్ ల్యాబ్స్ యాజమాన్యానికి సర్పంచ్ గొర్లి అమ్ములు, కుమారుడు గొర్లి గోవి, పంచాయతీ పాలకవర్గం ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి రామారావు, వార్డు మెంబర్లు పోలిరెడ్డి అప్పారావు, పైల అప్పారావు, పంచాయితీ కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-సబ్బవరం : అగ్ని ప్రమాదాల పై ప్రతి ఒక్కరు అవ గాహన కలిగి ఉండాలని సబ్బవరం ఫైర్ ఆఫీసర్ జి.వి.సత్యరాజు సూచించారు. మండల కేంద్రంలోని అగ్ని మాపక వారోత్సవాలులో భాగంగా మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో, సబ్బవరం మూడు రోడ్లు కూడలి నందు సబ్బవరం ఫైర్ ఆఫీసర్ జీ.వీ.సత్యరాజు ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రములు పంపిణీ చేసారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అగ్ని ప్రమాదం జరిగితే ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలియజేసి, అగ్ని మాపక శకటం నీటి ద్వారా మంటలను అదుపు చేయు విన్యాసాలను చేసి ప్రజలకు చూపించడమైనది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి లో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్మన్ కె.అప్పల నాయుడు, రథసారథి యం. శ్యామ్ కుమార్, వి.ద్వారకాద్రి, సి.హెచ్.బెన్వార్, యం.శివ పాల్గొన్నారు.

వి.మాడుగుల : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం మాడుగులలో సినిమా హాల్ వద్ద, బస్టాండ్ ఆవరణలోనూ అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఫైర్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలో ప్రజలకు వివరించారు. 14వ తేదీ నుండి 20 తేది వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావుతెలిపారు. దీనికి సంబంధించి రకరకాల ప్రదర్శనలు చేసి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎస్.రామారావు, ఎస్కె.మదీనా, ఎస్.వరహాలు, ఎన్.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శక్తి బృందాలతో అవగాహన సదస్సు

రూరల్ సీఐ రేవతమ్మ

విశాలాంధ్ర-నర్సీపట్నం : నర్సీపట్నం డివిజన్ మాకవర పాలెం మండలం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శక్తి బృందాలతో కలిసి నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ మాకవరపాలెం ఎస్ఐ దామోదర్‌లు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ 'పోక్సో' చట్టం, దాని చట్టపరమైన పరిణామాలు, ట్రాఫిక్ నియమాలు మరియు నిబంధనలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు డౌన్‌లోడ్‌లను ప్రోత్సహించడం పై వివరించారు. మహిళలపై నేరాలు, భద్రతా చర్యలు, ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన మరియు దాని పరిణామాలపై సీఐ రేవతమ్మ ప్రసంగించారు. ఈ సదస్సులో 700 మందికి పైగా విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ పరదేశమంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సోదరుడు వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెంలో గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన శ్రీపరదేశిమాంబ అమ్మవారి పండగ అనుపు మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమ చీరలు, తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిటిసి బైలిపూడి దేముడు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పంచకర్ల వెంకటేశ్వరరావును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుండి అమ్మవారి ఘటాలతో, బల్ల వేశాలతో, పలు సంస్కృత కార్యక్రమాలతో పురవీధుల్లో ఊరేగించి అనుపు మహోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుండి పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రీ కనకరాజు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, కొటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతురాజు, ఆదిరెడ్డి రమణ, కొటాన రాము, గండి దుర్గాప్రసాద్, సరగడం రాము, కిల్లి వెంకట సత్యనారాయణ, దొడ్డి ప్రకాష్, మామిడి శంకర్రావు, మామిడి కొండాజి, బంతికోళ్ల పద్మ, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, కోటాన దేముడుబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ,తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకుల కరతాల ధ్వనులే నటునికి పెద్ద బహుమతి

- సీనియర్ రంగస్థల నటులు, దర్శకుడు దాడి ముసలినాయుడు

విశాలాంధ్ర-మునగపాక: ప్రేక్షకుల కరతాల ధ్వనిలే నటునికి పెద్ద బహుమతి అని సీనియర్ రంగస్థల నటులు,దర్శకులు దాడి ముసలినాయుడు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీ కళా యూనియన్ రంగస్థల కళాకారుల సమావేశం భాగీరధి ఆలయం ఆవరణలో మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ కళా యూనియన్ రంగస్థల కళాకారులు గత 32 సంవత్సరాలుగా గ్రామంలోనే కాకుండా సంక్రాంతి, దసరా, శివరాత్రి, గ్రామదేవతల పండగల సందర్భాలలో వివిధ గ్రామాలలో నాటక, నాటిక ప్రదర్శనలు చేసి ప్రజా మన్ననలు పొందడం ప్రశంసనీయమన్నారు. అదే విధంగా పరిషత్ పోటీలలో తమ ప్రతిభను కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. లక్ష్మీ కళ యూనియన్ కళాకారులు నటనలోనే కాకుండా రచయితలుగా, దర్శకులుగా యూనియన్‌కు మంచి గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు.కళా యూనియన్ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం లక్ష్మీ కళా యూనియన్ నూతన కమిటీ అధ్యక్షునిగా పెంటకోట శివాజీ, కార్యదర్శిగా పెంటకోట సత్యనారాయణ, కోశాధికారిగా ఆదారి సూర్యచంద్ర రామారావులను కళాకారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దాడి కొండలరావు,పెంటకోట సత్యనారాయణ, బుద్ధ నాగు, చదరం వెంకట సూరి అప్పారావు, దాడి వీర, పెంటకోట సూరిబాబు, పెంటకోట శ్రీను, పక్కుర్తి కాశి, ప్రోత్సాహకులు ఆదారి మహేష్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ : నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలోని జనవరి 2 తేదీన పట్టుకున్న గంజాయి కేసు సంబంధించి వాటిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నర్సీపట్నం డి.ఎస్.పి పోతిరెడ్డి శ్రీనివాసరావు వెల్లడించారు. అడ్డరోడ్డులోని మంగళవారం నక్కపల్లి రూరల్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలోని గంజాయి కేసులో పట్టుబడిన వ్యక్తుల సమాచారంతో వ్యాపారం చేసే మూల సూత్రధారులు కోసం విచారణ చేయగా వారిపై నిఘా పెట్టడం జరిగిందన్నారు .అందులో భాగంగా రాజస్థాన్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏజెన్సీలో వ్యాపారాలు చేస్తూ అడ్డరోడ్డుకు రావడం గమనించిన స్థానిక పోలీసులు వారిని పట్టుకోవడం జరిగిందన్నారు. అందులో సువాన్ లాక్ సింగ్ ,కదం సింగ్ అనే ఇద్దరును అదుపులో తీసుకొని ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు .ఇద్దరినీ పట్టుకోవడంతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతోపాటు తాను కూడా నక్కపల్లి రూరల్ సీఐ ఎల్. రామకృష్ణ ,ఎస్సై ఏ విభూషణ్ రావు ను సిబ్బంది ని అభినందిస్తున్నట్లు తెలిపారు.

డిఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-చోడవరం : త్వరలో మెగా డిఎస్సీ వెలువడునున్న సంధర్భంగా ఆన్ లైన్ లో ఉచిత శిక్షణ పొందుటకు అర్హులైన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ సహాయ అధికారి ఎం నరసింహులు ఓ ప్రకటనలో తెలియజేశారు. టెట్ అర్హత సాధించిన బిసి, ఎస్.సి, ఎస్.టి, ఓ.బి.సి అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను, టెట్ పరీక్షలో అర్హత సాధించినట్లు తెలియజేసే సర్టిఫికెట్లను స్థానిక దుర్గా కాలనీలో గల బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయవలసిందిగా కోరారు ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల కోసం ప్రభుత్వ ప్రకటనను అనుసరించి ఆన్లైన్ కోచింగ్ ఎప్పుడు ప్రారంభించేది తెలియజేస్తామన్నారు కావున నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతాంగానికి మొండి చెయ్యి చూపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- కార్పొరేట్లకు వత్తాసు పలికిన అధికార ప్రభుత్వాలు
- కిసాన్ జాతీయ మహాసభలో రైతు గోడు వినిపించిన ఏ.పి. రైతు సంఘం నాయకులు

విశాలాంధ్ర-చోడవరం : రైతును రాజు చేస్తామంటూ నమ్మ బలికిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి చెయ్యి చూపుతూ రైతును నట్టేట ముంచుతున్నారని ఏ.పి. రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు జాతీయ కిసాన్ మహా సభలో రైతు గోడు వినిపించారు. తమిళనాడు రాష్ట్రం, నాగపట్నంలో జరుగుతున్న జాతీయ కిసాన్ 30వ మహాసభల ఆహ్వానం మేరకు అనకాపల్లి జిల్లా నుండి జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, జిల్లా అధ్యక్షులు మర్రి బాబులు మహాసభలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకుడు రెడ్డిపల్లి మాట్లాడుతూ ఏ.పి.లో అధికారంలో ఉన్న కుటమి ప్రభుత్వం సహకార షుగర్ ఫ్యాక్టరీలని పూర్తిగా నాశనం చేసి, కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పాలని ఆశయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార చెరకు కర్మాగారాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అన్నదాతకు ఆశ చూపి, మద్దతు ధర, రాయితీలు మాయం చేసి రైతులకు మొండి చెయ్య చూపిస్తున్నారని తెలిపారు. కార్మిక, కర్షకుల పట్ల అధికార ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేఖ విధానాలు తిప్పి కొట్టేందుకు జాతీయ మహాసభలో తీర్మానాలు చేసినట్లు మీడియాకు తెలియజేశారు.

ఐదు అడుగుల రోడ్డులో బహుళ అంతస్తుల నిర్మాణం!

- బిప్లాను సిఫార్సుకు అందిన ముడుపులు ఎంత..?
- బిప్లాన్ అప్రూవల్‌కు దొడ్డిదారిలో పిండిందెంత?
- బిభవిష్యత్తు ప్రమాదానికి బాధ్యులెవ్వరు?
- కుంచావారి వీధి, సాక్షిగా టౌన్ ప్లానింగ్ బరితెగింపు

విశాలాంధ్ర-అనకాపల్లి : డబ్బులు కోసం ఏమైనా చేస్తాం... ఎందాకైనా వెళతాం.. భవిష్యత్తులో ఏమైనా అగ్ని ప్రమాదాలు జరిగితే వాళ్లే పోతారు... మా వరకు మేము బాగానే ఉన్నాం కదా.. అనే నిర్లక్ష్య, ధనాపేక్ష భావనతో కొంతమంది ఎల్ టి పి లు, టౌన్ ప్లానింగ్ అధికారులు బరితెగించి అడ్డగోలుగా నిబంధనలను అతిక్రమించి ప్లాన్లు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రభుత్వానికి రావలసిన ఆదాయం పై అనకాపల్లి జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులకు అనవసరం. తమ జేబు దండిగా నిండితే చాలు అనే భావనతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇంచార్జ్ ఏసిపి వెంకట్రావు నిర్లక్ష్య విధి నిర్వహణ, జవాబు దారి తనం లేని సిబ్బంది వ్యవహారం వెరసి నిర్మాణదారులతో కుమ్మ కు. గత ఏడాదిగా టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న లాలూచీ వ్యవహారంపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు.. పట్టణంలోని కుంచావారి వీధిలో కనీసం ఐదు అడుగులు కూడా లేని రోడ్డులో నాలుగు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.2024 అక్టోబర్లో మంజూరు చేశారు. ఈ ప్లాన్ సిఫార్సు చేసిన ఎల్.టి.పి. శ్రీనివాసు, అప్రూవల్ చేసిన అధికారి పాత్రపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. నిబంధనల మేరకు ప్లాన్ మంజూరు చేయకూడదు. కానీ మంజూరు చేశారు. ప్లాన్ సిఫార్సు చేయడానికి, మంజూరు చేయడానికి వీరికి అందిన ముడుపులపై విచారణ జరపాలని, నిబంధనల మేరకు ఐదు అడుగుల రోడ్డులో ఎన్ని ఫ్లోర్లు ఉండాలో అవి ఉంచి మిగతా ఫ్లోర్లు తొలగించాలని డిమాండ్ ఉంది. అయితే ఇక్కడ ఒక ఆసక్తికర విషయం బయటపడింది. రోడ్డు విస్తరణ పెట్రోల్ బంక్ యజమాని స్థలం ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని , స్థలం ఇచ్చి సహకరిస్తే ఇక్కడ టి డి ఆర్ కుంచా వారి వీధిలో అదే పెట్రోల్ బంక్ యజమాని నిర్మిస్తున్న నిర్మాణానికి నిబంధనలను అతిక్రమించైన ప్లాన్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇంతవరకు బాగానే ఉన్నా నిబంధనలను అతిక్రమించి ప్లాను మంజూరు చేసినప్పుడు పెట్రోల్ బంక్ వద్ద స్థలానికి టి డి ఆర్ ఎందుకు ఇవ్వాలి ..? అభివృద్ధిని అడ్డుకుంటాం మా స్థలం ఇవ్వం అనే వ్యక్తులకు అధికారులు ఎందుకు దాసోహం అయ్యారు..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి..? లేనిపక్షంలో ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ వద్ద ఉన్న వారి టి డి ఆర్ ను రద్దు అని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జర్నలిస్టులకు కుటుంబసభ్యుడిగా అందుబాటులో ఉంటా

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్య బాబు
- టీజేఏఫ్ యూనియన్ సభ్యులకు ప్రోత్సాహకాలందజేత

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ & జిల్లా టీడీపీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు వడ్డాదిలో విలేకరుల కృతజ్ఞతా సమావేశం ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమానికి చోడవరం నియోజక వర్గంలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గంలో ఉన్న రోలుగుంట, రావికమతం, బుచ్చియ్యపేట చోడవరం మండలాల జర్నలిస్టు అందరూ ఐదు సంవత్సరాలనుండి అనేక సందర్భాల్లో మీడియా పరంగా మాకు అందుబాటులో ఉన్నారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌ల ఆశీస్సులతో నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పదవి తో పాటు జిల్లా టీడీపీ అధ్యక్షులు పదవి మరియు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ పదవి కూడా ఇచ్చి నన్ను గౌరవించారు. ప్రస్తుతం ఈస్థాయిలో ఉన్నానంటే మీ సహాయ, సహకారాలు ఎప్పటికి మరువ లేనని మీకు ఎల్లప్పుడూ ఒక కుటుంబ సభ్యుడిగా అందుబాటులో ఉంటూ, మీసమస్యల పరిష్కారం మార్గం ద్వారా మీ అభిమానం సంపాదించు కుంటానన్నారు. ఈ కార్యక్రమానికి టిజెఏఫ్ యూనియన్ నాయకులు రేణం సోమినాయుడు, శరగడం రాజు, ఉండా తాతారావు, మొటూరు గోవింద. అజయ్ ప్రసాద్, గణేష్, దేవిమోహన్, వాసు,పొందు మరియు జిల్లా టీడీపీ యూత్ విభాగం అధ్యక్షులు సిరిగిరి శెట్టి శ్రీరామ మూర్తి, వడ్డాది టౌన్ టీడీపీ అధ్యక్షులు దొండా నరేష్ పాల్గొన్నారు.

జిల్లాలో చివరి స్థానానికే పరిమితమైన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల

పేరు ఘనం ఫలితాలు శూన్యం!!
ప్రిన్సిపాల్ తీరుతో అప్రతిష్ట పాలవుతున్న వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం గ్రామ పెద్దలు అంతా ఏకమై తమ భవిష్యత్ తరాల దృష్ట్యా పెద్దలు కోట్ల రూపాయలు విలువచేసే ఆస్తులను త్యాగం చేస్తూ వడ్డాదిలో జూనియర్ కళాశాలను ప్రారంభించారు. అయితే ఆరంభం నుంచి దినదిన ప్రవర్తమానంగా కొనసాగుతూ ఓ దశలో అన్ని రంగాల నందు ఇక్కడి విద్యార్థులు జిల్లాకే తలమానికంగా నిలిచారు. దశాబ్దకాలం క్రిందట ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంగా నిలిచిన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల నేడు జిల్లాలో చివరి స్థానంలో నిలవడంలో ఇప్పటి సిబ్బంది నిర్లక్ష్యమే అని చెప్పుకోవడంలో పొరపాటు లేనేలేదు ఇప్పటి ప్రిన్సిపల్ అన్నపూర్ణ ఇష్టం వచ్చినట్లు తనకు నచ్చినట్లు సమయస్ఫూర్తి లేకుండా కళాశాలకి రావడం, పోవడం వ్యవహరిస్తున్నారని ఒప్పంద లెక్చరర్ చెప్పుడు మాటలు విని కళాశాల దీర్ఘకాల సిబ్బందిపై లేనిపోని ఆరోపణలతో మండిపడుతున్నారని కళాశాలలో జరుగుచున్న లోపాలను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్న ఘన చరిత్ర కలిగిన వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల నేటి అధ్యాపకుల తీరుతో భ్రష్టు పట్టిపోయింది. ఇక్కడి ప్రిన్సిపాల్ విధి విధానాలతో ఏకంగా జిల్లాలోని ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాలలో వడ్డాది విద్యార్థులు చివరి స్థానంలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.దీనితో విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కళాశాల సిబ్బందిని నిలదీసేందుకు సిద్ధమవుతున్నారని విశ్వసనీయ సమాచారం అయితే ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ జిల్లా స్థాయి ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలకు తావుతీస్తుంది.ఈ అంశాలపై సంబంధిత అధికారులను సంప్రదించాలని ప్రయత్నించినప్పటికీ అందుబాటులో లేరని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

వెంకటాపురంలో జ్వరాలు...

మంత్రి అనిత ఆదేశాలతో వైద్య శిబిరం ఏర్పాటు
గ్రామంలో అధికారుల బృందం పర్యటన

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో వెంకటాపురం గ్రామంలోని పలువురు జ్వరాలు కీళ్ల నొప్పులతో బారిన పడ్డారు. గత పది రోజుల నుంచి ప్రతి ఇంట్లోని వయసుతో నిమిత్తం లేకుండా జ్వరం రావడంతోపాటు విపరీతమైన కాళు చేతులు నొప్పులతో బాధపడుతున్నారు. సమీపంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, ఆర్ఎంపీ డాక్టర్ల వద్దకు కొందరు వెళ్లి చూపించుకోగా తగ్గకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న మండల తహసిల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ తదితర అధికారులు గ్రామంలోని పర్యటించి జ్వరంతో బాధపడుతున్న వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు మంచినీటి సమస్య లేకుండా చూడాలని అలాగే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలోని త్రాగునీరు సమస్య ఉందని మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికీ దగ్గరలో ఉప్పునీరు ఎక్కువ ఉండటం వల్ల సురక్షితమైన నీరు ఉండడం లేదని ఆ సమస్య పరిష్కరించాలని పలువురు అధికారులు కోరారు.

మంత్రి ఆదేశాలతో వైద్య శిబిరం ఏర్పాటు : గ్రామంలో జ్వరాల సమస్యపై రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనితకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం తెలియజేశారు. దీంతో మంత్రి ఆదేశాలతో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్.వాసంతి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు స్థానిక పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి జ్వరం కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని పరీక్షించి రక్త నమోనాలను సేకరించారు 99 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఎక్కువగా కీళ్ల నొప్పులు గుర్తించడం జరిగిందని మరో రెండు రోజులు ఈ గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతాదని వైద్యాధికారి తెలిపారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం మాజీ సర్పంచ్ అమలకంటి పాపారావు స్థానిక నాయకులు మరిశా త్రిమూర్తులు ముప్పిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మైచర్లపాలెంలో డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహోష్కరణ

విశాలాంధ్ర-చోడవరం : ఏప్రిల్ 15, మండలంలోని మైచర్లపాలెం గ్రామం లోని ఎస్సీ కాలనీ లో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ బూరె మాణిక్యం ఆవిష్కరించారు. బి. ఆర్.అంబేద్కర్ 134వ జన్మదిన వేడుకలను అంబేద్కర్స్ ఇండియా మిషన్ చోడవరం మండల అధ్యక్షులు రేగిన అప్పరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాణిక్యం మాట్లాడుతూ ఉన్నత భావాలు కలిగిన అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణ0 లో ఎనలేని కృషి చేసారని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో అంబేద్కర్స్ ఇండియా మిషన్ గ్రామ కమిటి సభ్యులు, గ్రామస్తులు తదితరులు అందరూ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-యలమంచిలి : అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని యలమంచిలి అగ్నిమాపక కేంద్రం అధికారి డి రాంబాబు అన్నారు. మంగళవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ లో కరపత్రాలు పంచి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఫైర్ సిబ్బంది ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

50% సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేత

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మండలంలోని చింతపాక గ్రామానికి చెందిన విస్సారపు కన్నయ్య అనే రైతుకు ఆన్ లైన్ లో వ్యక్తిగత పరికరాలు పంపిణీలో భాగంగా 100% ఆన్లైన్లోనే దరఖాస్తు విధానాన్ని ప్రవేశపెట్టి పూర్తిగా పారదర్శకతతో ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా రైతులకు మేలు జరగాలని ఉద్దేశంతో చేపట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లలో చింతపాక గ్రామానికి చెందిన రైతుకు 50% సబ్సిడీతో పవర్ వీడర్ ను గ్రామ సర్పంచ్ గొలజానా శ్రీనివాసరావు, కూటమి నాయకులు కలిమి శ్రీను చేతుల మీదుగా అందజేశారు కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ నాని తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

తాగునీరు సమస్య లేకుండా చూడాలి

విశాలాంధ్ర-అచ్యుతాపురం : త్రాగునీరు సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో నియోజవర్గంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. త్రాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.

చోడమాంబిక భక్తులకు మజ్జిగ, ఉచిత ప్రయాణం

విశాలాంధ్ర-అచ్యుతాపురం : చోడమాంబిక పండగ సందర్భంగా భక్తులకు ఉచిత ప్రయాణం, మజ్జిగ పంపిణీ చేశారు. మంగళవారం మోసయ్య పేట శ్రీయువశక్తి ఆటో యూనియన్ అసోసియేషన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో మోసయ్యపేట నుండి చోడమాంబిక గుడికి వెళ్లే భక్తులకు పది ఆటోలను పెట్టి ఉచిత ప్రయాణం, మజ్జిగ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె సోమునాయుడు, ఆటో యూనియన్ అధ్యక్షులు దమ్ము చండి, కార్యదర్శి పోలవరపు అప్పారావు, ఉపాధ్యక్షులు తట్ట రాజు, కోశాధికారి ధర్మిరెడ్డి సన్నిబాబు, దర్గా, మురళి, సూరిబాబు, అప్పారావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

నూకంబిక అమ్మవారికి రజిత హారం బహుకరణ

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో పేట సూది పురం గ్రామంలోని నూకంబిక అమ్మవారికి భక్తుడు వెండి రజిత హారం బహుకరించారు .గ్రామానికి చెందిన నానబోయిన నాగేష్ సత్యవతిల కుమారులు గణేష్ ,రమేష్ సహకారంతో 75 వేల రూపాయలు విలువ చేసే వెండి హారమును తయారు చేయించి అమ్మవారికి అలంకరించారు.